క్లుప్తంగా

ఉప కారాగారం తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: పట్టణంలోని ఉపకారాగారాన్ని హిందూపురం జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. కారాగారంలో ఎంత మంది ఖైదీలు ఉన్నారు? ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు? వారికి వైద్య సేవలు, ఆహారం అందుతున్న తీరును జైలు సూపరింటెండెంట్ హనుమన్నతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు గదులు, వంట గది, ఉచిత న్యాయ సహాయ గది, శుద్ధ జల ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడారు. జైలు నుంచి విడుదలైన తరువాత మంచి నడవడికతో ప్రశాంత జీవనం సాగించాలన్నారు. న్యాయమూర్తి వెంట ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస రెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సిద్ధూ, లోక్ అదాలత్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక వన భోజనాలు

చిలమత్తూరు: మండల రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్టు రెడ్డి సంక్షేమసంఘం సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మండలంలోని టేకులోడు అటవీప్రాంతంలో ఉన్న పడకలపల్లి మారెమ్మ దేవాలయం వద్ద కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి రెడ్డి కులస్తులు తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు.

మున్సిపల్ చైర్మన్‌కు అభినందనలు



బలరామిరెడ్డిని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బలరామిరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి మిత్ర బృందం కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ బలరామిరెడ్డి నాయకత్వంలో పట్టణాభివృద్ధి మరింత వేగవంతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, సర్పంచ్ నంజప్ప, ఎంపీటీసీ కృష్ణవేణి, నాయకులు లోకేష్‌రెడ్డి, గంగాధరప్ప, రంగనాథ్, రాజు, నాగరాజు, బాబురెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, మజీద్, సోముశేఖర్‌రెడ్డి, సుధాకర్, అనిల్, తిమ్మారెడ్డి, చంద్ర, గంగాధర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామానికి చెందిన గొల్ల సురేష్ తన స్కూటీలో కర్ణాటక రాష్ట్రం లింగదపల్లి నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏఎస్‌ఐ రామంజనేయులు తనకు వచ్చిన సమాచారం మేరకు దేవగానపల్లి క్రిష్ణమూర్తి తోట సమీపంలో తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనంలో వస్తున్న సురేష్‌ను ఆపి, స్కూటీని పరిశీలించగా.. హేవార్డ్స్ విస్కీ 90 ఎంఎల్ 94 టెట్రా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. గొల్ల సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం తెచ్చిన అమ్మినా నేరమన్నారు.

అంతర కళాశాల క్రీడల్లో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న డీన్, అధ్యాపకులు

మడకశిర రూరల్: బాపట్ల ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 17 నుంచి 20 వరకు జరిగిన అంతర కళాశాల క్రీడా పోటీల్లో మడకశిర వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారని కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీ దేవి తెలిపారు. క్రీడలు, సాంస్కృతికం, టెన్నికాయిట్, జావెలిన్‌త్రో, పరుగు పందెం, గ్రూపు, సోలో డ్యాన్స్, రంగోలి తదితర విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. విజేతలకు షీల్డులు, ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారని పేర్కొన్నారు. కళాశాల ఓఎస్‌ఏ డాక్టర్ సుమతి, ప్రొఫెసర్లు డాక్టర్ మురళీకృష్ణ, హరిబాబు, మంజుళ, మోహన్‌రావు, కిశోర్ సిబ్బంది విజేతలను అభినందించారు.

వెచ్చని నేస్తాలు



రిలయన్స్ పెట్రోల్ బంకు రోడ్డులో దుప్పట్లు, రగ్గుల దుకాణం



ఎంజీఎం గ్రౌండ్ వద్ద ఉన్ని దుస్తులు, టీషర్టుల విక్రయాలు

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో ఉన్ని దుస్తులకు డిమాండ్
- పలు చోట్ల వెలసిన దుకాణాలు

హిందూపురం: చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. హిందూపురం పరిసర ప్రాంతాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. ఉదయం 8 గంటల వరకూ ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు వణికిపోతున్నారు. వారి కోసం పట్టణంలో ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి. ఉత్తర, ఈశాన్య ప్రాంతాల నుంచి కొందరు పట్టణాల్లో రహదారుల పక్కన షెడ్లు, డేరాలు వేసి దాదాపు మూడు నెలలు స్థానికంగా ఉండి ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్లు, రగ్గులు ఇలా శీతాకాలంలో కావాల్సిన అన్ని దుస్తులు వీరు విస్తృతంగా విక్రయిస్తుంటారు. ఒడిశా, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాలతో నుంచి వచ్చిన వ్యాపారులు హిందూపురం పరిసరాల్లో పలు ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేస్తున్నారు.

పెరిగిన ధరలు

నాణ్యత, డిజైన్‌ను బట్టి స్వెట్టర్ రూ.300 నుంచి రూ.700 వరకూ వ్యాపారులు విక్రయిస్తున్నారు. మంకీ క్యాప్‌లు రూ.100 నుంచి నుంచి రూ.200, చేతి గ్లౌజులు రూ.100, బెడ్‌షీట్స్ రూ.800 నుంచి రూ.1500 వరకు ధర పలుకుతున్నాయి. ముడి సరుకుల ధరలు పెరుగుదల కారణంగా గత ఏడాదితో పోలిస్తే ఈసారి రేట్లు పెరిగాయని విక్రయదారులు, కొనుగోలుదారులతో చెబుతున్నారు. హిందూపురం పట్టణంలో రియలెన్స్ పెట్రోల్‌బంకు రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, నంది సర్కిల్, బెంగళూరు రోడ్లలో దుకాణాలు వెలిశాయి. నవంబరు ప్రారంభం ఫిబ్రవరి ఆఖరు వరకూ ఉన్ని దుస్తులు విక్రయాకాలు చేస్తుంటారు. ఏటా పట్టణంలో ఉన్ని దుస్తుల విక్రయాల కోసం మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్‌ల నుంచి వస్తారు. అక్టోబరులో వచ్చి ఫ్రిబవరి చివరి వరకూ విక్రయాలు చేసుకుని స్వగ్రామాలకు వెళ్తుంటారు. గత పది రోజులుగా సరిగా అమ్మకాలు లేవని ఇప్పుడే మొదలవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.. ఇక్కడి ప్రజల ఆదరణ, మాట తీరు బాగుంటుందన్నా. ఏటా ఇక్కడికి వచ్చి వ్యాపారాలు చేస్తాంటాం.. తిరిగి వెళ్లేటప్పుడు సొంత ప్రాంతాన్ని వదిలి వెళ్తున్నట్లు ఉంటుందంటున్నారు. వేసవికాలంలో దోమతెరలు, బెడ్‌షీట్లు కాటన్ దుస్తులు కూడా తీసుకువచ్చి వ్యాపారాలు చేస్తుంటామన్నారు. అలాగే కొంతమంది స్థానిక వ్యాపారులు కూడా బెంగళూరు, ముంబయ్ ప్రాంతాల నుంచి స్వెట్టర్లు, జర్కిన్స్, మఫ్లర్స్, మంకీ క్యాప్స్ తీసుకువచ్చి విక్రయిస్తుంటారు.

సాయంత్రం పూట సందడి



వారం రోజుల నుంచి చలి కొంచెం పెరుగుతూ ఉంది. ప్రజలు దుప్పట్లు, స్వెట్టర్లు కొంటున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గే కొద్దీ విక్రయాలు పెరుగుతాయి. ముఖ్యంగా సాయంత్రం పూట ఈ మార్గం కొనుగోలుదారులతో చాలా సందడిగా ఉంటుంది.

–పప్పులాల్, మధ్యప్రదేశ్, వ్యాపారి

ఏటా విక్రయాలు..



ఏటా శీతాకాలం బెంగళూరు, ముంబయ్ ప్రాంతాల నుంచి స్వెట్టర్లు, జర్కిన్స్, మఫ్లర్స్, మంకీ క్యాప్స్ తీసుకువచ్చి అమ్మకాలు చేస్తుంటా. ఇటీవల ప్రతి రోడ్డులోనూ విక్రయాలు పెరగడం వల్ల వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి.

–కలీం, రహమత్‌పురం, హిందూపురం

కామాంధులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థినులు

పెనుకొండ: విశాఖపట్నంలో లా విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థినిలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పిస్తామని చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదన్నారు. విద్యార్థులపై దాడులు, అత్యాచారాలు ఎక్కువగా జరగడానికి మత్తు పదార్థాలు, మద్యం ప్రధాన కారణమన్నారు. మహిళ హోం మంత్రి అయినా మహిళలకు రక్షణ లేదన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని సూగురు ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న అభయ ఆంజనేయస్వామి ఏకశిల రాతి విగ్రహ నిర్మాణానికి బెంగళూరు వాసి వై.సి.కార్తీక్ రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ వైసీ చంద్రశేఖర్ సారథ్యంలో దాతల సహకారంతో ఆంజనేయ స్వామి ఏక శిలారాతి విగ్రహాన్ని ప్రతిష్ట పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాయల గోపాల్, రాము, కిషోర్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



ఆర్డీటీ క్వాలిఫైడ్ మ్యాచ్‌కు ఎంపికైన మడకశిర జట్టు

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం మడకశిర ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. అండర్-8, అండర్-10 బాలబాలికల విభాగంలో మడకశిర, అగళి, పరిగి తదితర జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో మడకశిర జట్టు ఆర్డీటీ క్వాలిఫైడ్ మ్యాచ్‌కు అర్హత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు ఫిజికల్ డైరెక్టర్లు నాగభూషణం, ప్రకాష్, బాలాజి, జగదీష్, న్యాయ నిర్ణేతలుగా పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం



పరిగిలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పెనుకొండలో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది

పరిగి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దారు హసీనా సుల్తానా తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఆదివారం మండలంలోని పోలింగ్‌కేంద్రాల్లో ఓటరు నమోదుతోపాటు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, డిప్యూటీ తహసీల్దార్లు హనుమంతు, శోభ, వీఆర్వో సిద్దేశ్వర్, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

పెనుకొండ: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో శనివారం రెవెన్యూ అధికారులు స్వీప్ యాక్టివిటీస్ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆదివారం పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలు ఓటరు నమోదుతోపాటు ఓటరుజాబితాలో మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరిస్తార్నారు. రెవెన్యూ సిబ్బంది దర్బార్‌వలి, భాస్కరరెడ్డి, గణేష్ కుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: ఓటు హక్కు ద్వారానే దేశ ప్రగతి సాధ్యమని డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్ అన్నారు. నివారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

లేపాక్షి: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం లేపాక్షిలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి సూచించారు. అంతకుముందు నంది విగ్రహం, వీరభద్రస్వామి దేవాలయాల వద్ద రంగోళి నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం జయచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా 32 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. కొత్తపాళ్యం గ్రామంలో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పర్యవేక్షించారు. ఫారం-6 కోసం 20, ఫారం-7 కోసం 16, ఫారం-8 కోసం 8 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆదివారం కూడా అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని బూత్‌లెవెల్ అధికారులు చేపట్టడం జరుగుతుందన్నారు. కొత్తగా ఓటరు జాబితాలోకి చేరేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ ‘వన్ డే విజిట్’



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం: అసెంబ్లీ ఎన్నికల జరిగి ఫలితాల అనంతరం నాలుగో సారి ఎమ్మెల్యే బాలకృష్ణ వన్‌డే విజిట్‌కు శుక్రవారం హిందూపురం విచ్చేశారు. ఎమ్మెల్యే నేరుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుకు చేరుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, పీఏలతో నియోజకవర్గంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్లు, ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి మారిన కౌన్సిలర్లతో కొంతసేపు మాట్లాడారు. చైర్మన్ ఎన్నికకు సంబంధిచిన నోటిఫికేషన్‌పై మున్సిపల్ డీఎంఏతో మాట్లాడానన్నారు. నోటిఫికేషన్ రాగానే టీడీపీ కౌన్సిలర్లు ప్రతిపాదించిన వ్యక్తిని చైర్మన్‌గా ఎన్నుకోవాలని సూచించారు. త్వరలోనే మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు మంజూరవుతాయని, వాటితో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. తర్వాత మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుతో ప్రత్యేకంగా మాట్లాడారు. పట్టణంలో చేపట్టబోతున్న రైల్వే రోడ్డు, డీఎల్‌రోడ్డు విస్తరణ పనులపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే.. జిల్లా ఎస్పీ రత్న, డీఎస్పీ మహేష్, సీఐతో కలసి శాంతిభద్రత పర్యవేక్షణపై మాట్లాడారు. అనంతరం రాత్రి పట్టణంలో ఓ వివాహ రిసెప్షన్ వేడుకలకు హాజరయ్యారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు శనివారం ఇన్‌చార్జ్ పీడీ వరలక్ష్మిని కోరారు. ఈ మేరకు సీడీపీఓ కార్యాలయంలో ఆమెకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తర్కారీ, పప్పు దినుసులకు రావాల్సిన బిల్లులు రాక వర్కర్లు అప్పులు చేసి వండిపెడుతున్నారన్నారు. గ్యాస్‌కి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే ప్రాజెక్టులో కొన్ని సెంటర్లకు పాలు తక్కువగా వస్తున్నాయన్నారు. సమస్యలపై పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లిన స్పందన లేదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి శోభారాణి, అధ్యక్షురాలు అరుణ, సీఐటీయూ నాయకులు రాము, శశికళ, సభ్యులు మంజుల, అనిత, శైలమ్మ, జయసుధ, సుప్రజ, మాధవి, భాగ్యమ్మ, శాంతమ్మ, శివమ్మ, భారతి, శ్రీవల్లి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

రామగిరి: మండల కేంద్రంలో శనివారం మతిస్థిమితంతో దుకాణాల వద్ద తిరుగుతున్న ఓ బాలుడిని గుర్తించిన.. పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ తెలిపిన వివరాలు.. పరిగి మండలం కోనాపురం గ్రామానికి చెందిన అంజినప్ప, సుగుణ దంపతులకు ఏడేళ్ల వయసున్న కుమారుడు పవన్ ఉన్నాడు. పవన్ మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో శనివారం ఉదయం పరిగిలో బస్సు ఎక్కి పావగడ చేరుకున్నాడు. అక్కడి నుంచి రామగిరికి వచ్చాడు. దుకాణాల వద్ద తిరుగుతుండటంతో గమనించిన పోలీసులు బాలుడి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులను పిలిపించి, బాలుడిని అప్పగించారు.

ఘనంగా సత్యసాయి జయంత్యుత్సవాలు



మడకశిరలో భగవాన్ సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



లేపాక్షిలోని సాయిబాబా మందిరంలో భజన చేస్తున్న సాయి భక్తులు

రొద్దం: మండల కేంద్రంలో శనివారం సత్యసాయి 99వ జయంత్యుత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు. ఇంటింటా విభూతి, లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి రొద్దం సమితి కన్వీనర్ అంజినరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలవ్యాప్తంగా శనివారం భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలను సత్యసాయి భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మల్లాపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ జైసింగరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, సుధాకర రెడ్డి, శ్రీరాములు, నాగలీల, పురుషోత్తం, రజనీ, సత్యసాయి భక్తులు మిక్సర్ కృష్ణారెడ్డి, నీలే రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో శనివారం భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకే నగర సంకీర్తనలతో వివిధ పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సత్యసాయి శల్య చికిత్స కేంద్రంలో బాబా చిత్రపటానికి భక్తులు పూలమాలలు వేసి పూజలు చేశారు. బాబా చిత్రపటాన్ని ఊరేగించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు గోవింద రాజులు, గోపాలకృష్ణ, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలో శనివారం భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకుని సత్యసాయి సేవా సమితి భక్తులు బాబా చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. బాబాను స్మరిస్తూ భజనలు నిర్వహించారు. పట్టణ ప్రజలకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

లేపాక్షి: సత్యసాయిబాబా జయంతి సందర్భంగా శనివారం బాబా భక్తులు ఘనంగా నిర్వహించారు. బాబా మందిరంలో భక్తులు ప్రత్యేక భజన చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పెనుకొండలో బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

సంక్షిప్త సమాచారం

8న సాగునీటి సంఘాల ఎన్నికలు

మడకశిర: మండలంలో డిసెంబర్ 8న సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కరుణాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలను ఇంతకుముందు వెలువడిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 23న నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే ప్రభుత్వం అనివార్య కారణాలతో ఈ ఎన్నికలను వాయిదా వేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8న ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. డిసెంబర్ 5న నోటిఫికేషన్ విడుదల, డిసెంబర్ 8న ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 47 సంఘాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే అన్ని సంఘాల పరిధిలో ఓటరు జాబితాలను సిద్ధం చేసి ఉంచామన్నారు. మడకశిర మండలంలో 12 సంఘాలకు సంబంధించిన ఓటరు జాబితాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

రేపు ‘ప్రజా దర్బార్’

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మారుతి ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారని పేర్కొన్నారు. మండల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చేపల చెరువు వేలం

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు చెరువులో చేపల పెంపకానికి శనివారం గ్రామ సచివాలయంలో ఈఓఆర్డీ నాగరాజు నాయక్ వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో గుడిబండకు చెందిన గోవిందరాజులు రూ.2.5 లక్షలకు చేపల పెంపకం హక్కులను దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, వ్యాపాస్తులు పాల్గొన్నారు.

నేడు చండీహోమం

మడకశిర రూరల్: మండల పరిధిలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటలకు శ్రీరామరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా చండీహోమం నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

నేడు వైద్య శిబిరం

రొద్దం: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం సహారా రేడిఎస్సీ ఆధ్వర్యంలో రుక్మిణమ్మ, మాడిశెట్టి సీతారామయ్య జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సామాజిక సేవా కర్త దొంతి లక్ష్మినారాయణగుప్తా శనివారం తెలిపారు. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో శిబిరం జరుగుతుందన్నారు. చిన్న పిల్లలు, ఊపిరితిత్తుల, మత్తుమందు, ఎముకలు, కీళ్లు, చర్మ నిపుణులు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

చిలమత్తూరు: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం శనివారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు జేఏసీ సభ్యుడు అలీముల్లా ,సుబ్రహ్మణ్యం తెలిపారు. మండల గౌరవాధ్యక్షుడిగా అనిల్ కుమార్, అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీపతి, కోశాదికారిగా జగదీష్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా విజయ్ కుమార్, ముత్యాలప్ప ఎన్నికయ్యారు.

నేటి నుంచి ప్రవచనాలు

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహత్యం, విష్ణువు కథ, మహాశివుడిపై ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 24న అయ్యప్ప స్వామి మహత్యం, 25న విష్ణువు కథ, 26న మహాశివుడిపై ప్రవచనాలు చెబుతారని పేర్కొన్నారు.

డ్రైనేజీల్లో చెత్త వేస్తే జరిమానా

హిందూపురం: పట్టణంలో పండ్ల విక్రయదారులు చెత్తను రోడ్లపై, డ్రైనేజీలో వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. శానిటేషన్ పర్యవేక్షణలో భాగంగా శనివారం రహమత్‌పురం సర్కిల్‌లో పండ్లు అమ్మే వ్యాపారి చెత్తను రోడ్డుపై, డ్రైనేజీలో వేయడాన్ని కమిషనర్ అతని మొదటి తప్పుగా భావించి రూ.500 జరిమానా విధించారు. అలాగే పండ్ల వ్యాపారులు, ప్రజలు చెత్తను రోడ్లపై, కాల్వలో వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై పట్టణవాసులను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చైతన్య పరిచారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

రొళ్ల: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న వీఆర్‌ఏ రంగప్ప (75) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ పాండురంగప్ప, బ్రహ్మణ సంఘం నాయకుడు రవి భూషణ్‌తో పాటు పలువురు నాయకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రంగప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం మృతుడి కుమారుడు రంగనాథ్ గుడ్డగుర్కి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొళ్ల: గుడిబండ రోడ్డులో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ విద్యుత్‌శాఖ ఏఈ నిజాముద్దీన్ శనివారం ప్రకటనలో తెలిపారు. రొళ్ల, హులికుంట, హొట్టేబెట్ట, గుడ్డగుర్కి, రత్నగిరి, కాకితో పాటు దొడ్డేరి పంచాయతీ పరిధిలోని రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

రోడ్డు వెడల్పు చేయాలని ధర్నా

- మంత్రి హామీతో ఆందోళన విరమణ

పెనుకొండ: తమ గ్రామానికి ప్రధాన రహదారి అయిన చెరువు కట్ట రోడ్డును వెడల్పు చేయాలని ఇస్లాపురం గ్రామస్తులు చెరువుకట్టపై శనివారం ధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు నిఖిల్ (8) చెరువుకట్టపై ప్రైవేట్ స్కూల్ బస్ కిందపడి శుక్రవారం మరణించిన విషయం తెలిసిందే. చెరువు కట్టపై రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరిగిపోవడంతో రోడ్డు వెడల్పు చేయాలని ధర్నా నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటేశులు సంఘటనా స్థలానికి చేరుకుని మంత్రి సవితతో ఫోన్‌లో మాట్లాడించారు. తక్షణ చర్యలు చేపడతానని మంత్రి హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.